తేదీ 23-07-1987న ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

# మాయ, బ్రహ్మ, జీవుడు మూడు ఒక్కటే!

**భుజబలంబు మరియు బుద్ధిబలంబుండి**
**దైవబలము లేక దీనుడగును**
**కర్ణుడంతటివాడు కడపటికేమయ్యె**
**మరువబోకు డిట్టి మంచిమాట**
**దేవవుడన్నమాట తెలియునందరికి**
**మాట తెలిసినంత మూటయేమి**
**దేవుడైన యట్టి ధన్యుని పూజించి**
**దేవుడన్న మాట తెలియరయ్య**

ప్రేమస్వరూపులారా!

జీవునకు అజ్ఞానము తొలగక పరమాత్ముడే తాననే భావము కలుగదు. పరమాత్మ స్వరూపము, జ్ఞానము. అదే స్వయంజ్యోతి ప్రకాశము. ఆ ప్రకాశమే నేనని, ఆ జ్ఞానమే నేనని మానవుడు నిరంతరము తలచినప్పుడు యిదే అద్వైతస్థితి. వెలుగనగాయేమిటి? పదార్థములను తెలియజేయునది. అయితే, మనము నేడు పదార్థములను యే ఆధారములచేత చూడగలుగుచున్నాము? పగలు సూర్య ప్రకాశముచేత వస్తువులను మనము చూడగల్గుతున్నాము. రాత్రివేళలయందు చంద్రునియొక్క వెన్నెలచేతను, నక్షత్రముల ప్రకాశముచేతను, దీపముల వెలుగుచేతను వస్తువులను చూడగల్గుతున్నాము. అయితే యిది సూర్యప్రకాశమనియు, ఇది ఒక కాంతి అనియు, యిది దీపము వెలుతురనియు మనమేరీతిగా తెలుసుకోగల్గుతున్నాము? కన్నులద్వారా మనము తెలుసుకోగల్గుతున్నాము. నిద్రావస్థయందు మనము స్వప్నమును అనుభవిస్తున్నాము. కాని, యీ నిద్రావస్థయందు కన్నులు లేవు కదా! మూసుకొని వున్నవి కదా! కన్నులు

sri sathyasai vachanamrutam

చూచుటలేదు. కాని పగలు చూచినట్లుగానే సమస్త పదార్థములను మనము స్వప్నమునందు చూడగల్గుతున్నాము. అన్ని విధములకూడను మనము దృశ్యములను అనుభవిస్తున్నాము. అయితే చూచునదెవ్వరు? ఈ అనుభవించునదెవ్వరు? బుద్ధి తన తేజోమయమైన ప్రజ్ఞచేత యీ పదార్థములను చూడగల్గుచున్నది. కాని, సుషుప్తియందు ఆ బుద్ధికూడను లేదు కదా! అయినప్పటికి మానవుడు సుషుప్తియందు ఆనందమును అనుభవిస్తున్నాడు. ఈ ఆనందమును అనుభవించునదెవ్వరు? అదియే ఆత్మ. 'ఈ ఆత్మయే నేను, నేనే ఆత్మ', అనే సత్యాన్ని యీనాడు మనం గుర్తించుకోవాలి. ఆత్మచేతనే బుద్ధి, బుద్ధిచేతనే నేత్రములు, నేత్రములచేతనే పదార్థములు మనము గుర్తించుకోగలుగుతున్నాము. ఈ ఆత్మయే సత్యము. ఈ ఆత్మయే నీవు. ఇట్టి సత్యాన్ని అనుభవరీతిలో మనము అనుభవించినప్పుడే యేకత్వమనే దివ్యత్వాన్ని మనం గుర్తించటానికి అధికారులమవుతాము.

**అద్వైతత్రయము-భావాద్వైతము, క్రియాద్వైతము, పదార్థాద్వైతము**

దీనికి అద్వైతత్రయములు అనే తత్త్వాన్ని మొట్టమొదట మనం విచారించాలి. అద్వైతత్రయములనగా భావాద్వైతము, క్రియాద్వైతము, పదార్థాద్వైతము. ఈ మూడింటి తత్త్వాన్ని మనము చక్కగా విచారించిన సర్వమూ యేకత్వమనే భావాన్ని మనము అర్థం చేసుకుంటాము.

వస్త్రతంతున్యాయము. అనగా వస్త్రము, దారము దీనియొక్క న్యాయాన్ని మనం విచారించాలి. అయితే యీరెండింటియందు వుండిన పదార్థం యేమిటి? కార్యకారణములందుండిన ఏక శబ్దము-ఏక వస్తువు తత్వమే! యిదే అద్వైతము. ఈ వస్త్రమునందు, దారమునందు వుండిన పదార్థము ప్రత్తి ఒక్కటే! అనగా అనేకత్వములోని యేకత్వాన్ని గుర్తించటమే భావాద్వైత్వము. అనగా సమస్త మానవులందుండిన తత్త్వమేమిటో గుర్తించినప్పుడే యీ భావాద్వైతం మనకు అర్థమవుతుంది. కార్యకారణములందు యేక వస్తువుగా వుంటుండాలి. నేను అనేక పర్యాయములు చెప్తుంటాను

sri sathyasai vahanamrutam

**పశువులన్నియు వేరు పాలు ఒక్కటే**
**జీవజంతువులు వేరు జీవుండు ఒక్కడే**
**వస్త్ర భేదము వేరు వస్తువొకటె.**

ఇదే భావాద్వైతము. క్రియాద్వైతమనగా మనము త్రికరణ శుద్ధిగా చేసిన సమస్త కర్మలయందుకూడను ఫలితమును వేరుచేసి పరమాత్మ ప్రీత్యర్థంగా అనుభవించటమే! అనగా దైవార్పిత భావముతో కర్మలాచరించటమే క్రియాద్వైతము.

ఇంక వస్తు అద్వైతము. అనగా పదార్థ అద్వైతము. లోకములో అనేక రూపములు, నామములు మనము చూడగల్గుతున్నాము. రూపనామములు వేరైనప్పటికిని మానవులందరుకూడను, జీవులందరుకూడను ఒక్కటే! అందరియందు వుండిన పదార్థము పంచప్రాణములు. ఆకాశాది పంచ భూతములు. ఏ దేహమును పరిశీలించినప్పటికిని యీ ఐదు భూతములు తప్ప అన్యములు మనకు కనుపించవు. ఈ దేహమునందు యెట్టి మట్టి కలదో సమస్త దేహములందు అదే మట్టి వున్నది. ఈ దేహమునందు యే జలమున్నదో అదే జలము సమస్త ప్రాణులయందు వుంటున్నది. ఈ దేహమందు యెట్టి అగ్నివున్నదో సమస్త దేహములందు అదే అగ్ని వున్నది. ఈ దేహమునందు యే గాలి వున్నదో సమస్త జీవులందు అదే గాలి వున్నది. ఈ దేహమునందు యే శబ్దమును మనము అనుభవిస్తున్నామో సర్వ ప్రాణులయందు అదే శబ్దము వున్నది. కనుక యీ పంచభూతములనే పదార్థములు సమస్త ప్రాణులందు వుంటున్నది కనుక దీనిని కేవలము వస్తు అద్వైతము అంటున్నాము.

**అన్నిటియందు ఉండిన దివ్యత్వము ఒక్కటే!**

కనుక భావాద్వైతము, క్రియాద్వైతము, పదార్థఅద్వైతము మనము చక్కగా గుర్తించినప్పుడు సమస్తము యేకమని చక్కగా అర్థమవుతుంది. కేవలం ఉపాధి భేదములను పురస్కరించుకొని మనం భిన్నత్వముగా భావిస్తున్నాము. అన్నింటియందు వుండిన దివ్యత్వము ఒక్కటే. ఈ దివ్యత్వమనేది సర్వులయందుకూడను దేదీప్యమానమై ప్రకాశిస్తూవుంటుంది. అగ్నివుంది. ఈ అగ్నిలోపల దహనశక్తి వుంటుంది. ఉండినప్పటికి మనం కొంత అలక్ష్యము చేయటంచేత ఆ అగ్నినుండి వచ్చిన బూడిద అగ్నిని మరుగు

sri sathyasai vachanamrutam

చేస్తుంది. ఈ మరుగు చేసిన ధూళి యెక్కడనుండి వచ్చింది? అగ్నినుండే వచ్చింది. అగ్నినుండి వచ్చిన యీ ash అగ్నినే మూసేస్తుంది. అయితే తిరిగి మనము అగ్నిని చూడాలంటే యేమి చెయ్యాలి? ఆ పైనున్న బూడిద వుఫ్ అంటే పోతుంది. అగ్ని మనకు కనిపిస్తుంది. అదే విధముగానే ప్రతి మానవునియందును ఆత్మ అనే ప్రకాశవంతమైన అగ్ని వుంటుంది. దానిని మనము మరిచిపోతున్నాము. దేనివల్ల? ఈ ఉపాధి భేదం అనే ash cover చేయటంవల్ల మనం ఆత్మను మరచిపోతున్నాము. సాధనాది క్రియలచేత దానిని వేరుచేసుకున్నప్పుడు మనం దర్శించుకోగలము.

**మనస్సును భగవంతునితో సంయోగము చేయటమే సరైన రామభక్తి**

మరొక విషయము-'రమేరామేమనోరమే' అని ఒక పదముంది. ఇది సహస్రనామములయొక్క సారము. ఇదే దీనియొక్క పవిత్రత. దీనికి అనేకమంది పండితులు, విద్యావంతులు అనేక విధములైన అర్థములను తెలుపుతూ వస్తున్నారు. 'రమేరామేమనోరమే' దీనికి సరైన అర్థమేమనగా మనసును భగవంతునియందు రమింపచేయటమే! యింతే. మన మీనాడు మనస్సును అనేక విషయములందు రమింపజేసి 'రామ, రామ', అని ధ్యానిస్తున్నాము. చింతించటం ఒకటి. రమించటం మరొకటి. మనస్సును భగవంతునితో సంయోగము చేయటమే సరైన రామ భక్తి. అదే 'రమేరామే మనోరమే' అనే పదమునకు సరైన అర్థము. 'రామ' అనే పదానికికూడా మనం కొంత అర్థము తీసుకోవాలి. 'రా' అనగా పరబ్రహ్మతత్త్వము. 'మ' అనగా ప్రకృతి. యీ ప్రకృతి పరతత్త్వమును వదిలి వుండుటకు వీలులేదు. అదే గురు పూర్ణిమనాడు చెప్పిన సరైన సందేశము.

**దివ్యమైన ఎనర్జీ ఎన్నడూ క్షీణించేదికాదు**

ప్రకృతి, శుద్ధ చైతన్యముతో కూడివుంటున్నది. ప్రకృతి అంతా పదార్థములతో కూడినది. ఈ పదార్థములందు అంతర్భూతమై వుండినదే ఆత్మశక్తి. దీనినే సైన్సులో energy అన్నారు. దీనిని matter అన్నారు. energy అనేది నిరంతరము వుండేది. ఈ భౌతిక energy కాదిది. ఇది శుద్ధతత్త్వమైన energy. అది నిరంతరము వుండేది. కనుకనే Matter



sri sathyasai vachanamrutam

+ Being = GOD. ఈనాటి మన energy దినదినమునకు, క్షణక్షణమునకు క్షీణించిపోతున్నది. మాటలచేత అనేక విధములైన energy వృధా అయిపోతున్నది. మనదృష్టిచేత మనలో వుండే శక్తి తగ్గిపోతోంది. మన వినికిడిచేత మనలో వుండే energy క్షీణించిపోతోంది. మన తలంపులచేత మనలో వుండే energy తగ్గిపోతోంది. ఈ విధముగా మానవుడు చేసే ప్రతిక్రియలందు, ప్రతిదృష్టియందు, ప్రతిమాటయందుకూడను energy అనేది వృధా అవుతోంది. ఇది ప్రాకృతమైన energy. దివ్యమైన energy యేనాటికి క్షీణించేది కానీ, తరిగేది కాని కాదు. ప్రకృతికి, పరమాత్మకు యేనాటికిని యెడబాటులేదు. ప్రకృతి అంతయు పరమాత్మ స్వరూపంగా మనము భావించాలి. 'విశ్వం విష్ణుస్వరూపం'. మీరు రాముని చరిత్రయందు చదివి వుండవచ్చు. జనక మహారాజు యింటియందు వుండిన శివ ధనుస్సును రాముడు త్రుంచాడు. శివధనుస్సును విరచినాడుగాని ధనుస్సునకు యిటువైపున అటువైపునవున్న నారి మాత్రం తెగలేదు. నారికొక కొస రాముడు, మరొక కొస సీత. ఈ సీత, రాముల మధ్య యేమాత్రము యెడబాటు జరుగలేదు. ఈ నారి తెగకుండా వుండటమనేది ప్రకృతితో సమ్మిళితమైన దివ్యశక్తియే. కనుక దైవత్వమనేది ప్రకృతితో యేనాటికి కూడను యెడబాటు జరిగేది కాదు. అయినా 'అట్టి దివ్యమైన దైవత్వమునకు, అల్పమైన మానవత్వమునకు సంబంధం యెక్కడ?' అని, మనము కొంతవరకు నిరాశకు గురికావచ్చు. సముద్రము అనంతమైనది. అనంతమైనప్పటికి దానియందు వున్న గుణములు మూడే! సముద్రజలములో ఒక బిందువును బట్టపైన వేసుకుంటే తడిగావుంటుంది. ఈ తడికి చల్లదనముంటుంది. అదే నీరులో నురుగు వస్తుంది. తెల్లదనము, చల్లదనము, తడి యీ మూడు సముద్రముయొక్క లక్షణములు. అయితే యీ సముద్రమునందు యే మూడు గుణములు కలవో అవే మూడు గుణములు అల్పమై, అనిత్యమై, కొంతకాలములో క్షీణించిపోయే అలలయందుకూడా వుంటున్నాయి. అలలు మిథ్యమైనవి. అంతలోనే అణగిపోయేవి. కాని, సముద్రము మటుకు అణిగేదికాదు. ఈ అలలే మన దేహములు. ఈ దేహమునకు ఆది, అంత్యము వుంటున్నది. ఆద్యంతములతోకూడిన యీ వుపాధియందు అనంతమైన సముద్రముయొక్క గుణములుకూడా వుంటున్నాయి. కనుకనే దైవత్వమునకు, జీవత్వమునకు సన్నిహిత

sri sathyasai vachanamrutam

సంబంధబాంధవ్యమున్నదనే సత్యాన్ని మనము గుర్తించాలి. అయితే యీనాడు మానవత్వమనేది ఆధునికంగా యిలాంటి వానిని గుర్తించటానికి విముఖత చూపుతోంది. ఆధునిక మానవుడు జిరాఫీవలె తయారౌతున్నాడు. జిరాఫీ అనగా దీని అంతరార్థము యేమిటి? దాని తల, దాని హృదయానికి చాలా దూరంగా వుంటుంది. అదే విధంగా ఆధునిక మానవుని యోచించే తలకు, హృదయంలో వుండే ప్రేమకు పూర్తి భేదముగా కన్పిస్తాడు. జిరాఫీని జూలో చూసే వుంటారు. దాని మెడ చాలాపొడుగు. కాని, తల యెక్కడో వుంటుంది, హృదయం ఇంకెక్కడో వుంటుంది.

**చేతినిండా పని, హృదయమునిండా మంచి భావాలు ఉండాలి**

ఆధునిక విద్యార్థులంతా తలకు, హృదయానికి సంబంధము లేకుండా జీవిస్తున్నారు. తలకు, హృదయానికి సన్నిహిత సంబంధబాంధవ్యము చేర్చాలి. ఈనాడు యీ యేకత్వమనే విచారణకు అతి దూరంగా వుంటున్నాము. కారణమేమిటి? చేతినిండా పని లేదు. హృదయమునిండా మంచి భావములు లేవు. చేతినిండా పని, హృదయమునిండా మంచి భావాలు లేకపోతే వీనియొక్క జీవితము కుక్కతోకగా తయారౌతుంది. ఈ కుక్కతోక యెలావుంటుంది? బద్దవేసి కట్టినంతవరకు చక్కగా వుంటుంది. అది విప్పివేసిన తక్షణమే తిరిగి ముడుచుకుంటుంది. ఈనాడు సత్సంగములయందు, ఇలాంటి సమావేశములందు వుండిన మనసు బయటకు పోకుండా వుండలేదు. కారణమేమిటి? హృదయమునిండా దుర్భావములు, దుశ్చింతలు, దురాలోచనలు. కనుక, మొట్టమొదట యీ యవ్వనమునందు మనం చేతినిండా పని చేయాలి. హృదయమునిండా మంచి భావములు నింపుకోవాలి. ఈ విధమైన జీవితాన్ని మనము పోషించుకున్నప్పుడే యీ అనంతత్వములోని ఏకత్వాన్ని మనము అర్థము చేసుకొనేందుకు వీలవుతుంది. మనము దేనినీ త్యాగం చేయనక్కరలేదు. భోగమునందుకూడను త్యాగము మనము అనుభవించవచ్చు. అనగా దీని భావమేమిటంటే మనం విషయాసక్తిని, అహంకారమును దూరం గావించుకొని యేకార్యమును ఆచరించినప్పటికి మనసు సమత్వమైన పవిత్రతనే బోధిస్తుంది. ఈ విధమైన మార్గమును మనము నిత్యజీవితములో అనుభవింప

srisathyasaivachanamrutam

జేసుకున్నప్పుడే దైవత్వము మనకు చక్కగా అర్థమవుతుంది.

'దైవ' అనే పదమును మొట్టమొదట మనం అర్థం చేసుకోవాలి. 'దైవ' అనగా సమిష్టి అని అర్థము. అనగా యావత్ప్రపంచమంతయును దైవత్వమే! దీనినే గీత యందు 'విరాట్ స్వరూపమ'న్నారు. విశ్వమంతయు సమిష్టితో కూడినదే కనుక దీనినే దైవ అని చెబుతూ వచ్చారు. ఈ దైవత్వాన్ని మనము అనుభవించుకోవాలంటే దైవంయొక్క నామాన్ని మనం అర్థం చేసుకోవాలి. అనగా యీ నామమునకుండే అర్థాన్ని మనము తీసుకోవాలి. ఒక 'రాధ', 'కృష్ణ' అనే నామాలు మాత్రమే కాదు. అన్ని నామాలు మనవే!

దివ్యత్వంలో వుండే అంతరార్థములు అనంతంగా వుంటున్నాయి. ఈ అనంతమైన నామములో యథార్థమును మనము విస్మరించి అనర్థాన్ని స్వీకరిస్తున్నాము. ముఖ్యముగా దీనికి కారణము అవివేకము, అవిద్య. దీనికి వాసనాశక్తి బలవత్తరమైన కారణం. వాసనాసక్తి అనగా కేవలం తనతత్త్వాన్ని తాను విస్మరించి పరుల తత్త్వాన్ని ఆశ్రయించటమే! సత్యాన్ని అసత్యముగాను, అసత్యాన్ని సత్యంగాను నిరూపిస్తుంది; శాశ్వతాన్ని అశాశ్వతంగాను, అశాశ్వతాన్ని శాశ్వతంగాను విశ్వసిస్తుంది. ఈ అవిద్య అద్దమువంటిది. మనము నిల్చున్నప్పుడు మన కుడిచేయి ఎడమచేయిగా కన్పిస్తుంది. అదే దీని విరుద్ధము. సత్యాన్ని అసత్యంగా, అసత్యమును సత్యముగా నిరూపిస్తుంది.

**ఆత్మతత్త్వమును గురించిన బోధలు వినాలంటే రెండు చెవులు విరుద్ధమైన మార్గమును అవలంబిస్తాయి**

ప్రజ్ఞామాంద్యము యేలక్షణాన్ని నిరూపిస్తుంది? ఏ మంచి విషయాలు చెప్పినప్పటికి అవి చెవికి అందవు. మంచి విషయములు వినాలి అని అన్పించినప్పుడు అనేక విధములుగా దోమలవలె యీ ప్రజ్ఞామాంద్యము మన చెవిచుట్టూ చేరి దానిని వేరు చేయటానికి ప్రయత్నిస్తుంది. మనము మంచి విషయములు ఏవీ మన చెవికి చేర్చుకోము. చెడ్డ విషయాలైతే రెండు చెవులూ యేకాగ్రతతో వింటాయి. దీనినే

**ప్రొద్దుబోక యూరివారి సుద్దులన్న**
**మీరు సిద్ధమౌదురే కడు శ్రద్ధతోడ**

sri sathyasai vachanamrutam

**ముద్దుముద్దుగాను భగవత్ ముచ్చటలు చెప్పునపు**
**డొద్దిక నుండరే చెవులారా!**

దైవ విషయాలు చెప్పే సమయంలో, పవిత్రమైన ఆత్మతత్త్వం బోధించే సమయములో యీ రెండు చెవులు east and west వలె విరుద్ధమైన మార్గాన్ని అవలంబిస్తాయి. చెడ్డ విషయాలు వినాలంటే రెండూ యేకమైపోతాయి. ఈ లక్షణములే ప్రజ్ఞామాంద్యము.

**మంచిని చెడ్డగాను, చెడ్డను మంచిగాను వర్ణించే ప్రయత్నము చేస్తాడు కుతర్కము చేసేవాడు**

మూడవది వితర్కము. ఏది చెప్పినప్పటికి దానికి విరుద్ధమైన అర్థాలు కల్పించటము. ఒక చిన్న ఉదాహరణము. ఒక పరమ భక్తుడు

**శుక్లాంబంరధరం విష్ణుం-శశి వర్ణం చతుర్భుజం**
**ప్రసన్న వదనం ధ్యాయేత్సర్వవిఘ్నోపశాంతయే**

అంటాడు. అనగా తెల్లని వస్త్రములు ధరించినవాడు విఘ్నేశ్వరుడు. విష్ణుం, సర్వవ్యాపియైనవాడు. యీ విఘ్నేశ్వరుడు బూడిదరంగుతో కూడినవాడు. చతుర్భుజం నాలుగు చేతులు కల్గినవాడు. ఇది పరమ భక్తులు వర్ణించే విఘ్నేశ్వరుని వర్ణన. భక్తుడు కానివాడు దీనిని యెలా వితర్కం చేస్తాడంటే, 'శుక్లాంబరధరం' అనగా గుడ్డలంతా మోసేది గాడిద. విష్ణుం, యెక్కడ చూచినా తిరిగేది. దానిని కట్టేసేవాడు యెవడు లేడు. సర్వవ్యాపిగా స్వతంత్రముగా తిరుగుతూ వుంటుంది. అది గాడిద. బూడిదరంగులో వుండేది, గాడిద. చతుర్భుజమ్ నాల్గు కాళ్లుండేది, గాడిద. ఈ వర్ణన యెంత విరుద్ధంగా వుంది? కనుకనే మంచిని చెడ్డగాను, చెడ్డను మంచిగాను తన యిష్టము వచ్చినట్లుగా వర్ణించటానికి ప్రయత్నిస్తాడు, కుతర్కము చేసేవాడు.

నాల్గవది విపర్య దురాగ్రహము. అనగా అహంకారి. యేమీ తెలియక పోయినా 'నాకు అన్నీ తెలుసు, నాకు ఒకరు చెప్పేదేమిటి?' అని అహంకరిస్తాడు. అన్నీ తెలిసినవాడు యీ అనర్థములో యెందుకు ప్రవేశించాలి? ఇది కేవలము విపర్యదురాగ్రహము. అనగా తనలో వున్న మూర్ఖత్వము. ఎట్టి మానవునైనా సరిదిద్దవచ్చుగాని మూర్ఖుని సరిదిద్దలేము. ఈనాటి

sri sathyasai vachanamrutam

మానవునియందు విపర్యదురాగ్రహము, కుతర్కము, ప్రజ్ఞామాంద్యము, అవిద్య యీ నాల్గు తాండవమాడుతున్నాయి. ఈ నాల్గింటిని దూరము చేసుకోటానికి ప్రయత్నం చేయాలి. దీనికి చేయవలసిన ప్రయత్నం యేమిటి?

**పరిపరి విధముల పరుగెత్తే మనసును కట్టి పరమాత్మవైపు మరల్చటమే నిజమైన ధ్యానము**

మనము అనేక విధములైన సాధనలు సల్పుతున్నాము. ధ్యానం చేస్తున్నాము, మనం. ధ్యానం అంటే యేమిటి? కన్నులు మూసుకొని, పద్మాసనం వేసుకొని, హస్తములు బిగించుకొని కూర్చోటమా? ఇది ఫొటోకోసం. అంతేకాని, యిది నిజమైన ధ్యానం కాదు. ధ్యానమునకు ఒక పద్ధతే లేదు. మనసును భగవంతునిపై నియమించటమే నిజమైన ధ్యానము. జీవితమంతా ధ్యానముతో కూడినదే! మీరు పుస్తకాలు చదువుతూ దానిపైన ధ్యానం పెట్టారు. అక్కడ ధ్యానమే చేయకపోతే పుస్తకాలు నీవు చదవలేవు కదా! నీవు లెటర్ రాస్తున్నావు. లెటర్ వ్రాసే సమయములో యే అక్షరానికి ప్రక్కన మరో అక్షరం రావాలి అనే విషయంపై ధ్యానము లేకపోతే లెటర్ నీవు వ్రాయలేవు. బజారులో నడవాలంటే యెక్కడ యే కారు వస్తుందో, యెక్కడ యే లారీ వస్తుందో, యెక్కడ యే మనిషి వస్తున్నాడో అనే ధ్యానమే లేకపోతే నీవు బజారులో నడవలేవు. భోజనం చేసే సమయములోకూడా యెక్కడ యే కూర వుంది, యెక్కడ యే పచ్చడి వుంది అనే ధ్యానం లేకపోతే నీవు దానిని భుజించలేవు. కనుక, జీవితములో తెల్లవారి మొదలు రాత్రి పరుండునంత వరకు walking, talking, reading, writing, eating అన్నీ కూడను ధ్యానమే! అనగా యే విషయమునందు మనసును యిముడుస్తామో అదంతా ధ్యానమే! అయితే, యీ ధ్యానములో రెండు రకములైన ధ్యానములు, ప్రాకృతధ్యానము పరాకృత ధ్యానము అని వుంటున్నాయి. పరిపరి విధములుగా పరుగెత్తే యీ మనసును కట్టి పరమాత్ముని వైపు మరల్చటమే నిజమైన ధ్యానము. ఇటు పోయే మనసును అటు త్రిప్పటమే! అటు త్రిప్పుతే చాలు, మనకు మోక్షం లభిస్తుంది. ఇటు త్రిప్పుతే చాలు, బంధమేర్పడుతుంది. బీగంవుంది. బీగం చెవివుంది. బీగంచెవిని బీగంలోపెట్టి ఎడమవైపు త్రిప్పితే open అవుతుంది. కుడి ప్రక్క త్రిప్పితే మూసుకుంటుంది.

sri sathyasaivachanamrutam

**ధ్యానముకంటె సర్వులయందు వుండిన దైవమును ప్రేమించడం ఉత్తమమైన పద్ధతి**

మన హృదయమే ఒక lock. మన మనసు బీగంచెవి. దానిని హృదయములో పెట్టి God side turn చేయి, detachment. World side turn చేయి, attachment. కనుక, మనసును భగవంతునిపైన మరల్చుటమే నిజమైన ధ్యానము. ఆ సూక్ష్మాన్ని గుర్తించుకోలేక గంటలు, గంటలు ధ్యానములో కూర్చుంటున్నాము. ఆ గంటలలో కొన్ని గంటలు నిద్రలో చేరిపోతాయి. యింక కొన్ని నిముషాలు అనవసరమైన చింతలలో మునిగిపోతాము. ఎందుకిలాంటి ధ్యానము చేయటము? ఇలాంటి ధ్యానముచేసే బదులు యింటి పనులు చేయవచ్చు కదా! ఇంకేమైనా సమాజసేవలు చేయవచ్చు. అదే వుత్తమము, యీ ధ్యానముకంటె! ఒక్క క్షణమైనాకూడను మనసు నిలకడలేని ధ్యానంచేసి ప్రయోజనమేమిటి? కనుక, ఈ ధ్యానముకంటె సర్వులయందు వుండిన దైవత్వాన్ని ప్రేమించు. అదే నిజమైన ధ్యానము. Love all Serve all. ఈ రెండింటియొక్క తత్త్వాన్ని మనము గుర్తించాలి. ఒక జీవుని చూసి ద్వేషించటము మరొక జీవుని చూసి ప్రేమించటము, ఒక జీవుని హింసించటము మరొక జీవుని ప్రేమించటము. ఇది దైవత్వానికి తగదు. కనుక సర్వులను ప్రేమించే తత్త్వాన్ని మనము గుర్తించాలి.

మానవత్వంలో ఐదు విధములైన తత్త్వములుంటున్నాయి. మానవ దైవత్వం, మానవ మానవత్వం, మానవ దానవత్వం, మానవ పశుత్వం, మానవ హీనత్వం. ఈ ఐదింటిని మనం చక్కగా గుర్తించాలి. మానవునియందు ఒక దైవత్వముంటున్నాది. అదే 'ఈశావాస్యమిదంసర్వమ్' తనయందు ఆత్మతత్త్వమే లేకపోయినప్పుడు జీవితము వ్యర్థమవుతుంది. కనుక యిట్టి ఆత్మతత్త్వంపైననే మనసును యిమిడ్చి యీదేహమనేది ఒక వుపాధిగా భావించి, పుణ్యకార్యములందు, పవిత్రమైన మార్గములందు జీవితాన్ని ప్రవేశింప చేయటం ఉత్తమ మార్గము. నిరంతరము మంచి చింతన చేయటము, దానధర్మములలో ప్రవేశించటము, సేవాది కార్యక్రమములలో ప్రవేశించటం, దైవప్రేమలో జీవితాన్ని లీనము చేయటం యిది మానవదైవత్వము.

మానవ మానత్వమంటే కర్తవ్యకర్మలాచరించటము. బ్రహ్మచర్యము, గృహస్థం,

srisathyasaivachanamrutam

వానప్రస్తం, సన్యాసం, ఈ నాల్గుమార్గములందు జీవితాన్ని సక్రమంగా గడపటం మరియు వయోభేదమును పురస్కరించుకొని మనప్రవర్తనను పవిత్రమార్గంలో ప్రవేశపెట్టటము. మానవుడు సాధించవలసినవి, సత్యధర్మశాంతిప్రేమలనేవి. ఈ మానవత్వముతోకూడిన ప్రవర్తనలో జీవితాన్ని గడపటం, మానవ మానవత్వం.

**అజ్ఞానము లేకుండా వర్తించేదే మానవత్వము**

'మానవ' అంటే యేమిటో మొట్టమొదట అర్థం చేసుకోండి. 'నవ' అనగా క్రొత్తది, 'మా' అనగా కాదు. క్రొత్తది కానిదే మానవత్వం. అనగా యిది క్రొత్తది కాదు. అనేక జన్మలుగా వస్తుంటుంది. పాతదే యిది. రోతదే యిది. అంతేకాకుండా మరొక అర్థాన్నికూడా మనం తీసుకోవాలి. మానవ, మా-అనగా అజ్ఞానము, న-అనగా లేకుండా, వ-అనగా వర్తించటం. అనగా అజ్ఞానం లేకుండా వర్తించేదే మానవత్వము. కనుక అపవిత్రమైన మార్గములో పోకుండా దివ్యమైన మానవునికి అనుగుణమైన ధర్మమార్గములో ప్రవేశించటము మానవత్వం.

ఆహార విహారములందుమాత్రమేకాకుండా ఆచరణలయందుకూడను (cruel) అనగా కఠినమైన మార్గాన్ని అవలంబించటం, దయాదాక్షిణ్యములను, నీతినియమములను కోల్పోవడం. యిలాంటిదే దానవత్వము. కేవలం స్వార్థమే వారి జీవిత పరమార్థము. పరోపకారమనేది వారి జీవితములో యేనాడూ యెరుగరు. ఈ స్వార్థముతోకూడిన తత్వమే దానవత్వము. ఆకారము మానవాకారము, క్రియలు దానవత్వము కనుక మానవదానవత్వమని చెప్పారు. అనగా ధర్మవిరుద్ధములైన కార్యములందు ప్రవేశించటము.

ఇక మానవ పశుత్వమంటే యేమిటి ? ఆహార, నిద్ర, మైథునాదులు తప్ప యింక వానికేమీ అవసరం లేదు. తినటం, నిద్రించటం, ఆశలు పడటం, అనుభవించటం. ఈ నాల్గు పశుతత్వానికి లక్షణాలు. హిందిలో చెప్తారు 'ఖానా, పీనా, సోనా, మర్‌నా' అంటారు. తినటము, నిద్రించటము, చావటం. యెలా చావటం. అనుభవించి చావటం. దీనికింక మరోపరార్థము యేమీలేదు. ఇదే మానవపశుత్వం. ఇలాంటి మానవపశుత్వంకంటె అధమమైనది మరొకటి వుంది.

sri sathyasai vachanamrutam

మన స్వార్థాన్నైనా వదులుకొని పరులకు హింస కల్గించాలి. తన రెండు కన్నులూ పోయినా ఫరవాలేదు. యింకొకనికి కనీసం ఒక కన్ను పోవాలి. ఏమి దుర్భావము! ఉపకారము చేసినవానికే అపకారం కల్గించటం. అది హీనత్వం. కాని, అది కాదు నిజమైన మానవత్వం. ఉపకారికి ఉపకారం చేయటం గొప్ప మానవత్వం కాదు. అపకారికి ఉపకారము నెపమెన్నక చేయుట. అపకారికికూడ ఉపకారము చేయటము మానవత్వము.

కనుకనే, అన్నింటికన్నా అధమమైన మానవత్వంకంటె, పశుత్వంకంటె, దానవత్వంకంటె, మానవత్వ మానవత్వమును గడుపుకోటానికి మనము ప్రయత్నించాలి. మానవ దైవత్వమును పొందటానికి అందరకు సాధ్యముకాదు. కనీసం మానవునిగానైనా బ్రతకటానికి ప్రయత్నించండి. అందులోనే దైవత్వము పొందవచ్చు. మనము ఎన్ని చదువులు చదివినప్పటికి, ఎన్ని పట్టాలు అందుకున్నప్పటికి, ఎంత గొప్ప పదవులు యేలినప్పటికి మానవత్వాన్ని మాత్రం వదులుకోకూడదు.

మానవత్వమే లేకపోతే చదివిన చదువులంతా శ్మశానములో నక్కల అరుపులవంటివి అన్నారు. శ్మశానములో నక్కలు అరుస్తూవుంటాయి, నోరు తెరచి గట్టిగా! అట్లనే మనము స్కూలులో చదువుతూ వుంటాము గట్టిగా. శ్మశానములో నక్కల అరుపులు వంటివి, యీ చదువులు. మనము మాటలతో యెక్కువ చెబుతున్నామే కాని క్రియలలో యేమాత్రం అనుసరించటంలేదు అన్ని తెలిసిన విద్యావంతునిగా మనము విఱ్ఱవీగుతున్నామేగాని ఆచరణలో శూన్యముగా వుంటున్నాది. వేదశాస్త్ర యితిహాస పురాణములన్నీ కంఠస్థము చేస్తున్నాడు. కాని, చేతల్లో యేమాత్రము ఆచరించటంలేదు. ఇలా కంఠస్థము చేసుకున్నవి కంఠానికి భారమే తప్ప యేమీ సుఖము లేదు. ఆచరణలో చూపించాలి.

## దైవార్పిత భావముతో కర్మలాచరించు

అనేకత్వములోని యేకత్వాన్ని మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. మొట్టమొదట మనము భావాద్వైతాన్ని అభ్యసించాలి. నీ భావమును దైవములో యిమిడ్చి, చేయవలసిన కర్మలు సక్రమంగా నెరవేర్చి, ఈ కర్మల ఫలితాన్ని దైవార్పితము గావించి, నీవు ఆనందించు. నీవు దైవార్పితమైన భావముతో కర్మలాచరించు. నీవు భావాన్ని వృద్ధిపరచుకో.

sri sathyasai vachanamrutam

సర్వులయందు వుండిన పదార్థతత్త్వము ఒక్కటే! పంచభూతములయొక్క ఏకత్వాన్ని గుర్తించుకో! ఉపాధిభేదములను మనము పరిగణనలోనికి తీసుకోవటంవల్లనే యిన్ని విధములైన భిన్నత్వాలను అనుభవిస్తున్నాము. అయితే అన్నింటికి మధ్యలో ఒక మాయ ఆవరిస్తూ వుంటుంది. ఈ మాయ అంటే యేమిటి? మాయ అనగా లేనటువంటిదానిని వున్నట్లుగా భావించుకోవటమే మాయ. ఒక త్రాడును చూసాము. కాని మనసులో అజ్ఞానమనే అంధకారము ముంచుకొనివుంది. దానివల్ల త్రాడును చూసి పామని భయపడుతున్నాము. భయపడి మనము దూరము వెడుతున్నాము. టార్చి తెచ్చి దానిపైన వేసేటప్పటికి అది త్రాడు, పాముకాదు అని తెల్సింది. భయం పోయింది, ధైర్యం వచ్చింది. తనవలే యింకెవరైనా భ్రాంతి పడతారేమోనని చేతితో తీసి ప్రక్కన పెట్టేశాడు. ఈ లైటు లేక పూర్వము పాము లేదక్కడ. త్రాడు పోలేదు. టార్చివేసేటప్పటికి పాము పోలేదు, త్రాడు రాలేదు. చీకటిలో నున్నది త్రాడే, లైటు వేశాక వున్నదీ త్రాడే! పోయింది, వచ్చింది అనేది మన భ్రమ. ఆ భ్రమయే మాయ. మాయవుండినంతవరకు బ్రహ్మ మనకు తెలియదు. భ్రమ పోయినప్పుడే బ్రహ్మ వచ్చి చేరుతాడు. అదే మొన్న గురుపూర్ణిమ రోజుకూడా చెప్పాను. సముద్రములో అలలు అభివృద్ధి అవుతూ వుంటాయి. ఈ అలలకు కారణమేమిటి? ఈ అలలకు కారణము జలము. ఈ జలము అలగా మారటానికి కారణమేమిటి? దానిపై వాయువుయొక్క వత్తిడి. ఈ వత్తిడివలనే జలము అలగా మారుతుంది. ఇక్కడ మాయ యేమిటి, బ్రహ్మమేమిటి? జలమే బ్రహ్మ, వాయువే మాయ. అలయే జీవుడు. జీవుడనే అల యీ బ్రహ్మమునుండే వచ్చింది. మాయ అనే గాలి వత్తిడిచేత వచ్చింది. దీనిని సరిగా మనం చూస్తే గాలి అంటే గ్యాసు అంటారు. ఈ గ్యాసు అంటే యేమిటి, వట్టి అబద్ధమని! 'కొట్టాడురా వాడు, గ్యాసు కొట్టాడురా', అంటాము. అంటే అబద్ధము అని. ఆ gas అనే పదము మద్రాసు వాళ్ళకు బాగా అర్థమవుతుంది. 'కొట్టరా, కొట్టరా గ్యాస్ బుడ్డి' అంటారు. అంటే అబద్ధము చెబుతున్నాడని అంటారు. సోడాబుడ్డి మీకు తెలుసు. కొట్టేటప్పటికి గ్యాస్ భయటకు వస్తుంది. అంటే ఆ బాటిల్ లోపలికి వెళ్ళేటప్పటికి గ్యాస్ వస్తుంది. అనగా యీ గ్యాస్‌యొక్క ప్రెషరుచేత ఆవిరిలా వస్తుంది. అది తాగి మీరు యీ గ్యాస్‌తోనే తృప్తి పడుతున్నారు. ఈ జగత్తుకంతా గాలే ఆధారము. ఈనాడు వంటలు చేయటం గ్యాస్‌తోనే,

sri sathyasai vahanamrutam

సమస్తం గ్యాస్‌తోనే! అసలు జన్మకి కారణం గ్యాస్, అదే మాయ! ఆ మాయ అనే గాలి యీ బ్రహ్మ అనే జలానికి సోకటంచేత జీవుడు అనే అలగా తయారౌవుతుంది. కనుక మాయ, బ్రహ్మ, జీవుడు మూడు ఒక్కటే! జీవతత్వం యీ మాయవల్లనే ప్రారంభమైంది. అందువల్లనే 'మాయోపాధి జీవుడు' అన్నారు.

**పరమాత్ముని అనుగ్రహం పొందితే మాయ మనకు వశమౌతుంది**

మాయను మనమేవిధముగా తెల్సుకోవాలి? ఇది కేవలం మనయొక్క భ్రాంతియే imagination అని గుర్తించాలి. ఇది దైవాధీనమైనది కనుక పరమాత్ముని అనుగ్రహాన్ని లేక పరమాత్మ దివ్యస్వరూపాన్ని లేక తన తత్త్వాన్ని తాను గుర్తించుకుంటే మాయ మనకు వశమైపోతుంది. దైవత్వాన్ని గుర్తించుకుంటే మాయ సహజంగా పోతుంది. దీపం వెలిగిస్తే చీకటి అక్కడ వుండదు కదా! దీనినే 'తమసోమా జ్యోతిర్గమయ' అన్నారు. జీవుడనేవాడు బ్రహ్మనుండి వచ్చినవాడు. 'ఈ మాయ అనే వత్తిడిచేత నేను జీవుడయ్యానుగాని, నేను సాక్షాత్తు బ్రహ్మను' అనే విశ్వాసాన్ని మనం పెంచుకోవాలి. మన దృష్టిని విశాలమైనదానిగా మార్చుకోవాలి. మన హృదయాన్ని ప్రేమతో నింపుకోవాలి. ఈ రెండింటియందుకూడను మన అహంకార మమకారములను దూరం చేయాలి. అందువలనే గీతయందు 'నిర్మమో నిరహంకారః' 'అయ్యా! నీ మోహము, అహంకారము దూరము చేసుకో'మన్నాడు. ఈ మమత్వము, అహంకారముండినంతవరకు మానవుడు సత్యాన్ని గుర్తించుకోలేడు. ఈ రెండింటిని దూరం చేసుకున్నప్పుడే తన స్వరూపాన్ని తాను చూడగలడు. ఈ జగత్తంతా మిథ్యామయముగా కన్పించేది. అన్నింటియందు వుండినది యేకత్వమే! అదే సత్యము. ఒక విత్తనం వుంది, ఆ విత్తనం భూమిలో పెట్టాము. భూమినుండి మొక్క వచ్చింది. మొక్క వృక్షమైంది. వృక్షములో అనేక శాఖోపశాఖలు బయలుదేరాయి. ఆ వృక్షములోనే పువ్వులు, కాయలు వచ్చాయి ఆ పువ్వులే కాయలుగా మారాయి. కాయలన్నీ ఫలములుగా మారాయి. అయితే యీ ఫలములు, కాయలు, పువ్వులు, రెమ్మలు యివన్ని యెక్కడనుండి వచ్చాయి? అన్నింటికి విత్తనమే ఆధారము. అదే సత్యము. అదే ఆత్మ. జాగ్రతలో నీవు అన్నీ చూస్తున్నావు, అన్నీ అనుభవిస్తున్నావు. కానీ, చూసిన దృశ్యములను ఇంకా చూడనటువంటి దృశ్యములను స్వప్నములో నీవు

sri sathyasai vachanamrutam

అనుభవిస్తున్నావు, ఈ స్వప్నములో లేని ఆనందాన్ని నీవు సుషుప్తిలో అనుభవిస్తున్నావు. కాని జాగ్రత్, స్వప్న, సుషుప్తులు మూడు కాలములు వేర్వేరుగా వుంటాయి. మూడు కాలములందు వుండిన నీవు మాత్రం సత్యం. అదే ఆత్మ. చక్కెర తీసుకొని వెళ్ళి ఒక కప్పులో వేశాము. ఆ చక్కెర కరిగి నీళ్ళలో సర్వవ్యాపిగా మారింది. నీవు చేతిలో వేశావు, కంటితో చూశావు. కాని, కరిగిన తరువాత చేతికి చిక్కదు. కంటికి కన్పించదు. కానీ ఆ తీపి అనుభూతిలో సర్వత్రా వున్నట్లుగా నాలుకపై వేసుకుంటే తెలుస్తుంది. సర్వత్రా వ్యాపించినటువంటి మాధుర్యమే సత్యము. అదే ఆత్మ. కంటికి కన్పించదు, చేతికి చిక్కదు. అదే నిర్గుణం నిరంజనం. సర్వత్రా వ్యాపించినవాడు కనుకనే భగవంతునికి 'విభుడు' అని ఒక పేరు వచ్చింది. ఎట్టి ప్రమాణమునకు చిక్కనివాడు కనుక అతనికి 'అప్రమేయుడు' అని పేరు వచ్చింది. శబ్ద ప్రమాణమునకుగానీ, అనుమాన ప్రమాణమునకుగాని, ప్రత్యక్ష ప్రమాణమునకుగాని అందేవాడు కాదు. అతనినే అప్రమేయుడు అని అన్నారు.

**తనను తాను తెలుసుకోవటమే భగవత్తత్త్వము**

ఈ విధముగా భగవంతునికి గల ఒక్కొక్క పేరు అంతరార్థముతో కూడుకొని వున్నది. సర్వులయందువుండిన భగవంతుడు ఒక్కడే! సర్వులూ భగవంతుడే! కనుక, తనను తాను తెలుసుకోవటమే భగవత్‌తత్త్వము. కాని, అహంకార, మమకారములుండినంతవరకు తాను గుర్తించుకోలేడు. ఈ అహంకార, మమకారములు దూరము చేసుకున్నప్పుడే ఆయొక్క తత్త్వము అర్థమవుతుంది. నీ దేహతత్త్వాన్ని నీవు అర్పితము చేయి, నీ మనోతత్త్వాన్ని నీవు అర్పితము చేయి, నీ క్రియాఫలితాన్ని నీవు అర్పితము చేయి, ఇక మిగిలినదొక్కటే, అది నీవే! అట్టి స్థితిలో నా తల్లి, నా తండ్రి, నా మిత్రుడు, నా బంధువు నీవే అంటావు. తల్లి, తండ్రి, మిత్రులు యేనాటికో ఒక నాటికి వదిలిపెట్టి పోతారు. కానీ 'నీవు' అనేది యెప్పుడూ వుంటుంది. ఆ సత్యాన్ని మనం గుర్తించాలి. ఏనాటికైనా అవన్నీ కదలిపోయేవే. ఈ అన్నింటియందు వున్న 'నేను' (I) అనేదే శాశ్వత సత్యము.

**సర్వత్ర వుంటున్న యేకత్వమును (I తత్త్వము) గుర్తించుకోవటమే నిజమైన ఆత్మతత్త్వము**

ఆ I తత్త్వాన్ని నీవు గుర్తించాలి. who am I? అని question వేసుకోవాలి. ఈ who am



srisathyasaivachanamrutam

I లో I అనేటువంటి దానికి రెండర్థాలుంటున్నాయి. ఏకాక్షర I మరియు EYE యిది త్రయాక్షరి. Eye మన భౌతికమైన ఉపాధి. ఏకాక్షర I ఆత్మ. ఆ ఏకాక్షర I ను నీవు గుర్తించుకోటానికి ప్రయత్నం చేయాలి. యేదో భౌతికంగా 'నేను so and so నేను MA ప్యాసైనాను. నేను P.hd చేస్తున్నాను అంటే, అది నీ దేహముయొక్క తత్త్వము. 'నేను బ్రాహ్మణుడిని, నేను క్షత్రియుడను, నేను వైశ్యుడను, నేను యవ్వనుడను, నేను వృద్ధుడను' అనుకోవటం దేహతత్త్వమే కానీ, యేకాక్షర I తత్త్వము కాదు. దానికి కులభేదము, వయోభేదము లేదు. ఏదీలేదు. అది యెప్పుడు ఒక్కటిగానే వుంటుంది. కనుక ఆ యేకాక్షర I ని నీవు లక్ష్యంలో పెట్టుకో. అదే సర్వత్ర వుంటున్నది. ఆ సర్వత్ర వుంటున్న యేకత్వాన్ని గుర్తించుకోవటమే నిజమైన ఆత్మతత్త్వము.

గురిపూర్ణమనాడు చెప్పిన విషయాలు అనేకమంది వినలేదు. మరొక పర్యాయం చెప్పమని మన వైస్‌ఛాన్స్‌లర్ కోరాడు. నాకు కంఠస్థము చేసే అలవాటు లేదు. ఎప్పటికప్పుడే నేను మాట్లాడుతుంటాను. అదే యిప్పుడు చెప్పాలంటే నాకు రాదు. కొంతమంది యేదో ఒక విధమైన పద్ధతిని పెట్టుకుంటారు. కంఠస్థము చేసుకుంటారు. ఎక్కడికిపోయినా అదే కొట్టేస్తుంటారు తప్పెటలా! ఆ విధముగా నాకు రాదు. నేను అప్పటికప్పుడు వ్యక్తులనుచూచి ఆ సమయం, సందర్భాలను పురస్కరించుకొని, అడిగిన ఆశయాన్నికూడ పురస్కరించుకొని మాట్లాడవలసివస్తుంది.

**నా మాటలు ఎల్లప్పుడు అద్వైతముతో నిండియుంటాయి**

కానీ, నా మాటలన్నీ యెప్పుడూ అద్వైతముతోనే కూడివుంటాయి. ఎందుకంటే ద్వైతం, అనగా మరొకటి, లేదిక్కడ. 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ'. ఉన్నది ఒక్కటే! ఎన్ని విధాల చెప్పినా, అక్కడికే వచ్చి చేరాలి. ప్రాపంచిక విషయములను పరిశీలన చేసినప్పుడు దీనికి ఒక కర్త, కర్మ, క్రియ మూడుగా రూపొందుతుంటాయి. నాకిక్కడ కర్త, కర్మ, క్రియ మూడు కలసి ఒక్కటే! ఈ పిల్లలకు చెప్పే సమయములో మాత్రము యివన్నీ పాటించాలి. ఈ కర్త, కర్మ, క్రియ వీటినికూడా అర్థము చేసుకోలేని మూర్ఖులు కొంతమంది వుంటారు.

ఒక టీచరు క్లాసులోకి వచ్చాడు. దానిలో అన్నీ చెప్తూ 'కర్త, కర్మ, క్రియ' గురించి యేదో

srisathyasaivachanamrutam

సమయసందర్భాలను పురస్కరించుకొని అడిగాడు. ఒక విద్యార్థిని 'కర్త యెవరురా?' అని అడిగాడు. వాడు ఈ పాఠం వినలేదు. నిద్రపోతున్నాడు, పాపం! అమాయకంగా 'సార్! మీరు అడుగుతున్నారు కాబట్టి, మీరే కర్త' అన్నాడు. ఇంకోడిని లేపాడు, 'క్రియ అంటే యేమిటిరా?' అన్నాడు. 'మీరు చాలా విషయాలు చెబుతున్నారు కనుక, ఆ విషయాలు క్రియ' అన్నాడు. యింకొకడిని పిలిచాడు. 'కర్మ యెవరురా అన్నాడు?' 'కర్మ యేమిటి?' అన్నాడు. 'సార్! మీ పాఠం వినటానికి మాకిష్టం లేకపోయినా వినవలసి వచ్చింది. ఇది మా కర్మ' అన్నాడు. అనగా కర్మ అంటే యేమిటో, కర్త అంటే యేమిటో, క్రియ అంటే యేమిటో తెలియని విద్యార్థులున్నారు యీనాడు. ఇలాంటి విద్యార్థులకు అలాంటి టీచర్లు సరిపోతుంటారు. కానీ నాకలాంటిది తెలియదు. నేను యెక్కడికి వెళ్ళినప్పటికి అద్వైతమే! ఉన్నది ఒక్కటే! కనుక నేను ఎన్ని మార్గములలో ప్రయాణం చేసినప్పటికినీ అదే గమ్యము చేరుతాను.

**నా జీవితమే నా సందేశము**

కనుక విద్యార్థులారా! My life is My message నన్ను మీరు అనుసరించి, ఆ అద్వైతాన్ని మీరు పూర్తిగా అర్థం చేసుకుంటే జగత్తంతా మీరు పరిశుద్ధము గావించిన వారౌతారు. ఎప్పుడు అద్వైతాన్ని మనము అర్థంచేసుకుంటామో అప్పుడు రాగద్వేషాలు చెప్పకుండా పారిపోతాయి. అహంకారాన్ని దూరం చేయటానికి, మమత్వాన్ని కొంతవరకు control చేయటానికి అద్వైతము అనుసరించాలి. అప్పుడే యెవ్వరిపైన, యేవిధమైన అసూయ, ద్వేషము, డంబము యిలాంటి క్రూర భావములు మన హృదయములో ప్రవేశించవు. మానవుడు మానవుడిగా బ్రతకాలి. దానినుండి మానవ దైవత్వానికి ఎదగాలి. అంతేకాని, మానవ దానవత్వానికి మానవ పశుత్వానికి మనం దిగజారిపోకూడదు. ఈ విధముగా మీరు దివ్యత్వాన్ని పొందటానికి తగిన కృషి చేయాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

**(తేదీ 23-07-1987న ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam